గమనించకుంటే.. గుంతలోకే!

- గోతులమయంగా ఓబులవారిపల్లె - గాదెల రహదారి
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని నాయకులు, అధికారులు
- గుంతలు పూడ్చాలంటున్న ప్రజానీకం


గుంతలమయంగా ఉన్న మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి


అధ్వానంగా తయారైన ఓబులవారిపల్లె-గాదెల ప్రధాన రహదారి

ఓబులవారిపల్లె : మండల కేంద్రం నుంచి చిన్నఓరంపాడు అడ్డరోడ్డుకు వెళ్లే ప్రధాన రహదారిపై వర్షానికి పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. అలానే మండల కేంద్రం నుంచి గాదెల గ్రామానికి వెళ్లే మార్గం గుంతలమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గం గుండా దాదాపు 15 గ్రామాల ప్రజలు, వాహనదారులు ప్రతి నిత్యం ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఎన్ని సార్లు చెప్పినా పాలకులు కానీ, అధికారులు కానీ పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. మండల కేంద్రానికి ప్రతి రోజూ తహసీల్దార్, ఎంపీడీఓ, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు నియోజవర్గ నాయకులు ఈ మార్గం గుండా ప్రయాణిస్తుంటారు. అయినా తమకెందుకు అన్నట్టు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొన్నిచోట్ల గ్రామాల ప్రధాన రహదారుల గుంతలు పూడ్చామని అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అది కనిపించడంలేదంటూ మండల ప్రజలు మండిపడుతున్నారు. ప్రతి రోజూ వివిధ పనుల నిమిత్తం ప్రయాణాలు చేసేవారు ఎప్పుడు ఎక్కడ నుంచి ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళనలతో ప్రజలు రాకపోకలు సాధిస్తున్నారు. ఇటీవలే పాము లేరు బ్రిడ్జి సమీపంలో ప్రైవేటు స్కూల్ బస్సు అదుపు తప్పి బోల్తా పడటంతో చిన్నారి మృతి చెందింది. ప్రమాదాలు జరిగినా పట్టించుకోలేదంటే అధికారులు, నాయకులు ఎంత బాధ్యత రాహిత్యంగా వ్యవహరిస్తున్నారో తెలుసుకోవచ్చు. మండలంలోని రహదారులపై మరో ప్రమాదం జరుగకమునుపే సంబంధిత అధికారులు, నాయకులు స్పందించి రహదారిపై ఏర్పడ్డ గుంతలు పూడ్చాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

గుంతలు పూడ్చలేదు



చాలా రోజులుగా ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడి దుమ్ము లేస్తోంది. అలానే వాహనాలు వేగంగా వస్తుండటంతో గుంతలు గమనించకపోతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతి రోజు అధికారులు ఈ మార్గంగుండా ప్రయాణిస్తుంటారు. ఈ రోడ్డు దుస్థితిని చూసి అయినా పనులు చేస్తారనుకుంటే ఇప్పటి వరకు చర్యలకు నోచుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరుకుంటున్నా.

– సానుగారి విశ్వనాథరెడ్డి, ఓబులవారిపల్లె

ప్రమాదకరంగా గోతులు



చిన్నఓరంపాడు నుండి గాదెల గ్రామానికి వచ్చే రోడ్డు ప్రమాదకరంగా మారింది. చిన్నపాటి గుంతలు పెద్దవిగా మారడంతో వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. కనీసం గుంతలను పూడ్చకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సాఫీగా సాగాల్సిన ప్రయాణం గుంతల కారణంగా ఇబ్బందికరంగా సాగుతోంది. వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి.

– ఎస్.వెంకటరమణ, పునాటివారిపల్లె, ఓబులవారిపల్లె

క్లుప్తంగా

నేడు వైభవంగా అయ్యప్ప పడిపూజ

రాజంపేట రూరల్ : శ్రీఅయ్యప్పస్వామి దేవస్థానంలో మండలపూజను పురస్కరించుకొని శుక్రవారం అత్యంత వైభవంగా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మలపెంట పాలప్రకాష్, రాఘవరెడ్డి వెంకటేశ్వరరెడ్డిలు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సాయంత్రం 7గంటల నుంచి నిర్వహించే ఈ పడిపూజ కార్యక్రమంలో అయ్యప్పస్వామి దీక్ష చేపట్టిన వారితోపాటు వివిధ దేవతామూర్తుల దీక్షలు చేపట్టిన వారు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ప్రతి రోజు మాదిరిగానే అయ్యప్ప భజనల అనంతరం దీక్షాపరులకు భిక్ష ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు.

జూదరుల అరెస్టు

వీరబల్లి : మండలంలోని మట్లి తొగటపల్లిలో జూదం ఆడుతున్నారన్న సమాచారం రావడంతో స్థానిక పోలీసులు అక్కడికి వెళ్లి జూదం ఆడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారివద్ద నుంచి రూ. 2150లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

గిరి ప్రదక్షిణలో పాల్గొనండి


ఆకేపాటికి ఆహ్వానపత్రిక అందించిన గిరి ప్రదక్షిణ కమిటీ సభ్యులు

రాజంపేట రూరల్ : ప్రముఖ శైవ పుణ్యక్షేత్రమైన అత్తిరాలలో నిర్వహించే కార్తిక పౌర్ణమి వేడుకలకు రావాల్సిందిగా ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డిని గిరి ప్రదక్షిణ కమిటీ ప్రతినిధులు ఆహ్వానించారు. మండల పరిధిలోని ఆకేపాడు ఎస్టేట్‌కు గురువారం గిరి ప్రదక్షిణ కమిటీ ప్రతినిధులు వచ్చారు. ఈ నెల 15న కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని భక్తి శ్రద్ధలతో అత్తిరాలలోని శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరస్వామికి అత్యంత వేడుకగా చేపట్టే గిరి ప్రదక్షిణలో పాల్గొనాలని కోరారు. అదే విధంగా శివపార్వతుల కల్యాణంను తిలకించవలసిందిగా కోరారు.

కార్తిక పౌర్ణమి పూజలకు ఏర్పాట్లు పూర్తి

సంబేపల్లె : మండల పరిధి మోటకట్ల వెంకట శివసాయి ఆలయంలో నేడు కార్తిక పౌర్ణమి పూజలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ నిర్వాహకులు బి.వి.సుబ్బారెడ్డి కుటుంబీకు తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తామన్నారు. అలాగే మండలంలోని వివిధ ఆలయాలలో కార్తిక పౌర్ణమి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరుపుతామని ఆయా ఆలయాల నిర్వాహకులు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ


దారి సమస్యపై బాధితులతో మాట్లాడుతున్న రాయచోటి ఆర్డీఓ శ్రీనివాసులు

చిన్నమండెం : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని రాయచోటి రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలను అందజేశారు. అనంతరం మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామం శ్రీరాంనగర్ కాలనీలో నెలకొన్న సమస్యపై బాధితులు అయిన శాంతమ్మ, అంజనమ్మలతో మాట్లాడారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, పలువురు అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి


మాట్లాడుతున్న సీఈఓ ఓబులమ్మ

ఒంటిమిట్ట : మండలంలోని పంచాయతీల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని జిల్లా పరిషత్ సీఈఓ సి.ఓబులమ్మ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సభా భవనంలో ఎంపీపీ సోమశేఖర్ ఆధ్వర్యంలో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ సీఈఓ ఓబులమ్మ హాజరై ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులకు ప్రణాళిక రూపకల్పనకు సంబంధించి శిక్షణ ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేశ అభివృద్ధికి గ్రామాలు పట్టుకొమ్మలని, గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. అందరూ కలిసికట్టుగా పని చేసి గ్రామాల్లో మౌలిక వసతులు, సదుపాయాలను సమకూర్చి అభివృద్ధి పథంలో నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ నుంచి రక్షణ


ఓబులవారిపల్లె: అవగాహన ర్యాలీలో వైద్య సిబ్బంది

ఓబులవారిపల్లె : ముందస్తు పరీక్షలు ద్వారా క్యాన్సర్ నుంచి రక్షణ పొందవచ్చని వైద్యాధికారి రాజశేఖర్ పేర్కొన్నారు. గురువారం ముక్కావారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్యాన్సర్‌పై విజయం – స్క్రీనింగ్‌తో సాధ్యం కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో నోటి క్యాన్సర్, రక్తహీనత తదితర వాటికి ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆరోగ్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు.

మహాధర్నాను జయప్రదం చేయండి


పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

రాయచోటి అర్బన్ : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నవంబరు 18న నిర్వహింప తలపెట్టిన చలో విజయవాడ మహాధర్నాను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాయచోటి అధ్యక్ష, కార్యదర్శులు సాయి, పవన్ నాయుడులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక డైట్ పాఠశాల ఆవరణలో వారు సంఘం నేతలతో కలసి ధర్నా పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు పోరాటాలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ. 3,480 కోట్ల విద్యాదీవెన, వసతిదీవెన బకాయిలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం తదితర డిమాండ్‌లను నెరవేర్చడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. సమస్యల పరిష్కారం కోసం జరిగే మహాధర్నాను విద్యార్థులు విజయవంతం చేయాలంటూ కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నేతలు గురునాథ్, శివాజీ, సన్నీ, నరసింహా, తిరుమల నాయుడు, నాగేంద్ర, అమర్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ


పెనగలూరు: ఎన్ఆర్ పురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు దుస్తుల పంపిణీ

పెనగలూరు : మండలంలోని పెనగలూరు కాంప్లెక్స్ పరిధిలో ఆరు ప్రాథమిక పాఠశాలలకు నూతన దుస్తులను గురువారం పంపిణీ చేశారు. బాలల దినోత్సవం సందర్భంగా ఎన్ఆర్ పురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు శేషారెడ్డి సతీమణి సీఆర్పీ సుజాతలు ఆరు ప్రాథమిక పాఠశాలలకు నూతన దుస్తులను పంపిణీ చేశారు. ఎంపీపీఎస్, గాంధీనగర్ ఎస్టీ కాలనీ ఈఅండ్‌డీ సిద్దవరం కొత్తపల్లి, ఇండ్లూరు, పెనగలూరు, ఎస్ఆర్ పురం ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఈ దుస్తులు పంపిణీ చేశారు.

పారిశుద్ధ్యంపై అశ్రద్ధ వహిస్తే చర్యలు


మాట్లాడుతున్న డీపీఓ బాలకృష్ణారెడ్డి

గుర్రంకొండ: గ్రామాల్లో పారిశుద్ధ్యంపై అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని పంచాయతీ కార్యదర్శులను డీపీఓ బాలకృష్ణారెడ్డి హెచ్చరించారు. గురువారం స్థానిక సచివాలయంలో మండలంలోని అన్ని సచివాలయాలకు చెందిన కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో చెత్తను తొలగించి పరిసరాల్లో బ్లీచింగ్ చల్లించాలని సూచించారు. 15 ఆర్థిక సంఘం నిధులు గ్రామాలకు మంజూరు అయ్యాయని పారిశుద్ధ్య పనుల కోసం వీటిని వినియోగించుకోవాలన్నారు. గ్రామాల్లో సేకరించే చెత్తను పొడి, తడి చెత్తగా విభజించాలని, ఇందుకోసం పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను నియమించుకోవాలన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి

నిమ్మనపల్లె : సీసీ రోడ్ల నిర్మాణాలలో నాణ్యత పాటించాలని డ్వామా పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొండయ్య గారి పల్లెలో పల్లె పండుగ ద్వారా వేసిన సీసీ రోడ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్లకు త్వరగా బిల్లులు చెల్లించాలని ఏపీడీ, ఏపీలను ఆదేశించారు. మండలంలో ఉపాధి హామీ పథకంలో పల్లె పండుగ ద్వారా రూ.1.50 కోట్లతో 40 పనులు మంజూరయ్యాయని తెలిపారు. కొండయ్య గారి పల్లెలో రూ.7.5 లక్షలతో 202 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కలికిరి క్లస్టర్ ఉపాధి హామీ ఏపీడీ శ్రీనివాసులు, నిమనపల్లె ఏపీఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుకు విత్తనశుద్ధి తప్పనిసరి


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజ

సిద్దవటం : రబీలో సాగుచేసే ప్రతి పంటకు రైతులు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలని బద్వేల్ ఏడీఏ నాగరాజ తెలిపారు. సిద్దవటం మండలంలోని టక్కోలు రైతు సేవా కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశామని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఇ-పంట, పొలం బడి, సూక్ష్మసేద్యం, పీఎం కిసాన్, సిబ్బంది హాజరు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రికార్డుల నిర్వహణ చాలా ముఖ్యమైన బాధ్యత అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కోత దశలో ఉన్న వరి పంటను పరిశీలించామన్నారు. 33 శాతంపైగా పంట నష్టం వాటిల్లితేనే నష్టం పరిహారం అందుతుందని చెప్పారు. వేరుశనగ, వరి, మినుము పంటలను పరిశీలించి జాగ్రత్త చర్యలను తెలియజేశారు. కార్యక్రమంలో రైతుసేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు వంశీ, శివఫణీంద్ర, స్కిప్పర్ డ్రిప్ ప్రతినిధి ప్రసాద్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సింగరయ్య, పల్లవి, రైతులు మునిరెడ్డి, రామసుబ్బారెడ్డి, చిన్నకేశవరెడ్డి, వెంకటయ్య, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చినుకు రాలితే ప్రయాణం అధ్వానమే


కొద్దిపాటి వర్షానికి కొలనుగా మారిన రామాపురం - లక్కిరెడ్డిపల్లె రోడ్డు మార్గం

రామాపురం : మండల కేంద్రంలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వర్షం వస్తే మాత్రం కనీసం నడవడానికి కూడా అవకాశం లేని పరిస్థితి ఏర్పడింది. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఇదే పరిస్థితి నెలకొంది. రహదారులు, భవనాల శాఖ ఉద్యోగులు నిత్యం ఈ మార్గం గుండే ప్రయాణం సాగిస్తుంటారు, కనీసం చీమ కుట్టినట్లు కూడా ఉండడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. మూడు రోడ్ల కూడలి నుండి లక్కిరెడ్డిపల్లెకు వెళ్లే మార్గం అధ్వానంగా తయారైంది. ఇటీవల రాచపల్లె వరకు తారు రోడ్డు వేసి సరిపెట్టుకున్నారు. మరో రెండు కిలోమీటర్లు ఎలాంటి మరమ్మతులు చేయకుండానే అలాగే వదిలేయడంతో వాహనదారులు, పాదచారులు చాలా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో రాచపల్లి వద్ద నుండి మూడు రోడ్ల కూడలి వరకు రెండు వైపులా డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినప్పటికీ అది మాత్రం ఆచరణకు నోచుకోలేదు. డ్రైనేజీలకు కావాల్సిన స్థలం ఆర్అండ్‌బీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఈ ప్రభుత్వంలో ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీలకే ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తామంటున్నా మండల కేంద్రాన్ని మాత్రం ఎవరు పట్టించుకోవడం లేదని పలువురు విమర్శలు వినిపిస్తున్నారు.

ప్రారంభమైన గ్రంథాలయ వారోత్సవాలు


వీరబల్లి: నెహ్రూ చిత్రపటానికి పూలమాలలతో నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సిద్దవటం : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రమైన సిద్దవటంలోని గ్రంథాలయంలో జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం శ్రీరాములు ఆధ్వర్యంలో ప్రారంభ వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన నెహ్రూ చిత్రపటానికి పూలమాలలతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ గ్రంథాలయంలో లభించే పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయ అధికారిణి లక్ష్మీనారాయణమ్మ మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.రామలింగారెడ్డి, బి.హరికొండయ్య, లలిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ఓబులవారిపల్లె : విజ్ఞాన బాండాగారాలు గ్రంథాలయాలని ఎంఈఓ రెడ్డయ్య పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలు ద్వారా మంచి పుస్తకాలు చదివి విజ్ఞానం పెంచుకోవాలన్నారు. గ్రంథాలయాలకు వెళ్లే అలవాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రంథాలయ నిర్వాహకులు అష్రఫ్ అలీ మాట్లాడుతూ ఈనెల 14వ తేది నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లిలో..

వీరబల్లి : మండల కేంద్రంలో ఉన్న గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించారు. గ్రంథాలయ అధికారిణి విజయలక్ష్మీ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

రాజంపేటలో..

రాజంపేట టౌన్ : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.పురుషోత్తం తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రిన్సిపల్ ప్రారంభించి మాట్లాడారు. గూగుల్‌లో వెతికినా దొరకని సమాచారం గ్రంథాలయాల్లో దొరుకుతుందన్నారు. గ్రంథాలయాల్లోని పుస్తకాలను చదివి అనేక మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని, అలాగే ఉద్యోగాలను కూడా పొందారన్నారు. కళాశాలలో ఉన్న గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.


సిద్దవటం: మాట్లాడుతున్న జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

దేశ మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకుని బాలల దినోత్సవ వేడుకలను మండలాల్లో ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో జరిగిన వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నెహ్రూకు చిన్నపిల్లల పట్ల ఉన్న ప్రేమను ఉపాధ్యాయులు తెలియజేశారు. ప్రధానిగా ఆయన సేవలు నేటి తరం అనుభవిస్తున్నారని చెప్పారు. దేశ భవిష్యత్ రేపటి తరానిదని, విద్యార్థులు చదువుల్లో రాణించి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలంరించారు. అనంతరం విద్యార్థులకు నిర్వాహకులు మిఠాయిలు పంచిపెట్టారు. అంతకు ముందు నెహ్రూ చిత్రపటానికి ఘనంగా నివాళి అర్పించారు.

– సాక్షి, నెట్‌వర్క్


సంబేపల్లె: విద్యార్థులకు స్వీట్లు తినిపిస్తున్న ఉప విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి


చిట్వేలి: జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు


రాయచోటి టౌన్: చిన్నారులకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ స్వాతిరెడ్డి


రాజంపేట టౌన్: నృత్యాలు చేస్తున్న ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు


రాజంపేట రూరల్: చిన్నారికి బహుమతిని అందజేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి


చిన్నమండెం: మోడల్ స్కూల్‌లో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


ఓబులవారిపల్లె: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


లక్కిరెడ్డిపల్లి: ఐసీడీఎస్ కార్యాలయంలో..


పుల్లంపేట: దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో..

ప్రణాళికాబద్ధంగా పంచాయతీల అభివృద్ధి


వీరబల్లి: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి


లక్కిరెడ్డిపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి


చిన్నమండెం: మాట్లాడుతున్న డీఎల్‌డీఓ లక్ష్మీపతి

గాలివీడు/సిద్దవటం/పుల్లంపేట/చిట్వేలి/లక్కిరెడ్డిపల్లి/రామాపురం/వీరబల్లి/చిన్నమండెం : ప్రణాళికాబద్ధంగా పంచాయతీల అభివృద్ధికి దోహదపడాలని ఆయా ఎంపీడీఓలు జవహర్ బాబు, ఫణిరాజకుమారి, జయశ్రీ, మోహన్, నాగలక్ష్మీ, జాషువా, డీఎల్‌డీఓ లక్ష్మీపతిలు పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సభా భవనంలో గ్రామ పంచాయితీల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీలలో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు గ్రామాభివృద్ధి ప్రణాళికలు దోహదపడతాయన్నారు. ఈ ప్రణాళికలో ఏ పనులు అయితే ప్రతిపాదిస్తారో ఆయా పనులే చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆమె సూచించారు. మంజూరైన పనులు సకాలంలో పూర్తి చేసేందుకు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రణాళికలు రూపకల్పనలో అందరూ భాగస్వాములు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీసీఐ లింకు తప్పనిసరి

తంబళ్లపల్లె: సంక్షేమ పథకాలు అందాలంటే బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ లింకు తప్పనిసరని ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలో సుమారు 3,900 బ్యాంకు ఖాతాలు ఆగిపోయాయని వాటిని పునరుద్ధరించి ఎన్‌పీసీఐ లింకు చేయాలన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు, బీపీఎంలు సమన్వయంతో ఇంటికి వెళ్లి వారికి అవగాహన కల్పించాలన్నారు.